క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం మందిపల్ గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సలీం, రాము, బుచ్చయ్య, శివ దర్శన్, పుల్లప్ప, యాదయ్య పాల్గొన్నారు.

పనిచేసే వారికి ప్రాధాన్యత



గోవింద్ నాయక్‌ను సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

కుల్కచర్ల: పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య అన్నారు. నూతనంగా ఆ పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా అడవివెంకటాపూర్ గ్రామానికి చెందిన గోవింద్ నాయక్‌ను నియమించారు. ఈ సందర్భంగా గురువారం గోవింద్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్‌కుమార్, నాయకులు శ్రీను, సత్యయ్య, యాదగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ ఉంటే విజయం మీదే



విద్యార్థులతో మాట్లాడుతున్న జహీర్ పాష

పెద్దేముల్: పేద విద్యార్థులు ఉన్నతంగా చదువుకునే విధంగా ఏఎస్‌జీఎంకే చారి ట్రబుల్ ట్రస్ట్ అన్ని విధాలా సహాయపడుతుందని ట్రస్ట్ కో–ఆర్డినేటర్ జహీర్ పాష అన్నారు. గురువారం మండల పరిధి ఇందూరు ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఒత్తిడిని ఎలా జయించాలని వివరించారు. పది పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

కేజీబీవీలో సైన్స్ డే



సైన్స్‌డేలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: విద్యార్థులు సాధారణ చదువులతో పాటు తమలోని నైపుణ్యాన్ని వివిధ అంశాలపై దృష్టిసారించి, వాటిలో ప్రతిభను చూపాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి దేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో సైన్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతిభను చాటేందుకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, నైపుణ్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలని సూచించారు.

పురాతన నీటిట్యాంకు పరిశీలన

కుల్కచర్ల: పురాతనమైన నీటిట్యాంకు వద్దకు గ్రామస్తులు ఎవరూ వెళ్లరాదని మిషన్ భగీరథ డీఈ సుబ్రహ్మణ్యం సూచించారు. మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామంలో 1982లో నిర్మించిన నీటి ట్యాంక్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడారు. నూతన ఆర్థిక సంవత్సరంలో పురాతన ట్యాంకు కూల్చి వేసి, అదేస్థానంలో నూతన ట్యాంకు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విలేకర్లపై కేసు నమోదు

అనంతగిరి: విలేకరులం అని చెప్పి డబ్బు వసూళ్లకు పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు అయింది. వివరాలు ఇలా ఉన్నాయి. నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి గ్రామంలో పాత్రికేయులం అని చెప్పి, ఇద్దరు టీచర్లను బెదిరించి, డబ్బు వసూలు చేసిన ఆరుగురు వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు మేరకు నవాబ్‌పేట పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇక మీదట ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఇంటర్ సెకండియర్ తొలిరోజు ప్రశాంతం

- నిమిషం నిబంధన పాటించిన అధికారులు
- పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్ల మూసివేత



పెద్దేముల్: హాల్ టికెట్ నంబర్లను సరి చూసుకుంటున్న విద్యార్థినులు

పెద్దేముల్: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు తహసీల్దార్ కిషన్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డిలు పర్యవేక్షించగా.. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రం చుట్టు పక్కల ఉన్న జిరాక్స్ సెంటర్లను మూయించారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 228 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 8 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించలేదని పేర్కొన్నారు. సెంటర్ వద్ద తాగునీటితో పాటు, వైద్య సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు.

తాండూరులో 35 మంది గైర్హాజరు

తాండూరు టౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు తొలిరోజు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జనరల్ విభాగంలో మొత్తం 1,507 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 25 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 541 మంది విద్యార్థులకు గాను 10 మంది రాలేదు.

11 మంది గైర్హాజరు

కొడంగల్ రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం సబ్జెక్టులకు పరీక్ష నిర్వహించారు. మొత్తం 512మంది విద్యార్థులకు గాను 501మంది హాజరయ్యారని నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో 166మందికి గాను ఇద్దరు గైర్హాజరు కాగా.. రామలింగేశ్వర కాలేజీలో 224మందికి 5గురు ఆబ్సెంట్ అయ్యారు.



పెద్దేముల్: విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



తాండూరు టౌన్: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



కుల్కచర్ల: హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

గుట్ట ఎక్కుతూ ఆగిన ఆర్టీసీ బస్సు



కాలినడకన గుట్టపైకి వెళ్తున్న ప్రయాణికులు

- కెపాసిటీకి మించి ప్రయాణికులు ఎక్కడం వల్లే మొరాయించిన బస్సు
- కాలినడకన గుట్ట ఎక్కిన ప్యాసింజర్స్

ధారూరు: తాండూరు నుంచి ధారూరు మీదుగా మెహిదీపట్నం వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అనంతగిరిగుట్ట ఎక్కుతూ ఆగిపోయింది. బస్సు ఎంతకీ ముందుకు కదలకపోవడంతో.. డ్రైవర్ బస్సులోంచి సగం మంది ప్రయాణికులను కిందకు దింపి, గుట్ట ఎక్కించారు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. టీఎస్ 08 జెడ్ 0002 ఎక్స్‌ప్రెస్ బస్సు తాండూరు నుంచి బయలుదేరి అనంతగిరిగుట్ట ఎక్కుతుండగా.. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటంతో మధ్యలో ఆగిపోయింది. స్పెషల్ గేర్ వేసినా ముందుకు సాగలేదు. దీంతో డ్రైవర్ విజ్ఞప్తి మేరకు కొంత మంది దిగి, కాలినడకన గుట్టపైకి ఎక్కారు.

కాలం చెల్లిన బస్సులతో సమస్య

కొత్త సర్వీసులు లేక, కాలం చెల్లిన బస్సులతో రవాణా సంస్థ కాలంమెల్లదీస్తుందని, అవి



మధ్యలో ఆగిన బస్సు

ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతాయో తెలియడం లేదని ప్రయాణికులు ఆరోపించారు. ముఖ్యంగా తాండూరు ఆర్టీసీ డిపో బస్సులు ఎక్కువగా ట్రబుల్ ఇస్తున్నాయని పేర్కొన్నారు. కొత్త బస్సులు నడపాలని సంస్థ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. కొత్తవి లేకుంటే తామేం చేస్తామని అధికారులు సమాధానం ఇస్తున్నారని వివరించారు. ఇకనైనా సంస్థ అధికారులు స్పందించి, కొత్త సర్వీసులను నడపాలని కోరారు.

‘ఉలేమా’ సేవలు హర్షణీయం

తాండూరు టౌన్: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు జమియత్ ఉలేమా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి అన్నారు. గురువారం రైల్వే స్టేషన్, వినాయక్ చౌక్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను డీఎస్పీ, తహసీల్దార్ తారాసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న జమియత్ ఉలేమా సేవలు అభినందనీయమన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు శుద్ధి చేసిన నీటిని పంపిణీ చేయడం సంతోషించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా పండితుల సంఘం అధ్యక్షుడు మౌలానా అబ్దుల్లా అజార్ ఖాస్మి, మత విద్యా మండలి తాండూరు అధ్యక్షుడు మౌలానా ఆసిఫుద్దీన్ రషీది, సంఘం సభ్యులు డాక్టర్ హఫీజ్ అబ్దుల్ సలాం, అబ్దుల్ రహమాన్ అతర్ ఖాస్మి, హఫీజ్ రైసుద్దీన్, మక్బూల్ అహ్మద్, కమాల్ అతర్, ఫరూఖ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి తదితరులు

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



విద్యార్థినులకు నగదు అందజేస్తున్న మాజీ ఎంపీ కొండా

మోమిన్‌పేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వింటేజ్ సెంట్రల్ పాఠశాలలో సైన్స్‌ఫేర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.2500ల చొప్పున, జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ తరఫున స్కాలర్ షిప్‌ను ఆయన అందజేశారు. అనంతరం కొండా మట్లాడారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు సైన్స్‌ఫేర్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అదే ప్రతిభ ఆధారంగా ఉన్నత విద్యలో రానిస్తారని తెలిపారు. విద్యార్థుల్లో మనో ధైర్యం పెంచేందుకు ప్రధాని మోదీ వారితో మన్‌కీ బాత్ కార్యక్రమంతో ముచ్చటిస్తున్నారని కొండా వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్

కొడంగల్: పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. మార్చి 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్నాయని, విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు బొంరాస్‌పేటలో రెండు, కొడంగల్‌లో నాలుగు, ఒక ప్రైవేట్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతంలో టెన్త్‌లో ఫెయిల్ అయిన వారు కూడా కొడంగల్‌లోనే పరీక్ష రాసే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నట్లు ఎంఈఓ వెల్లడించారు.

ఉర్దూమీడియం బడిని అభివృద్ధి చేయాలి

కొత్తూరు: మండలంలో కొనసాగుతున్న ఉర్దూ మీడియం పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని మైనార్టీ సంఘం నాయకుడు లతీఫ్ గురువారం ఒక ప్రకటనలో విద్యాశాఖ అధికారులను కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలను సొంత భవనానికి మార్చాలని పేర్కొన్నారు. ఇక్కడ తగినంత బోధన సిబ్బంది లేరని గుర్తు చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా నిలుస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీం రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో భైరం వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, స్థానిక నేతల ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్, కడుమూరి రాంరెడ్డి, మాలె వెంకటయ్య గౌడ్, లింగంగారి రాములు, కృష్ణయ్య, రాములు, అక్బర్, శ్రీనివాస్, నర్సింహులు, కళ్యాణ్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఎస్ఐ



బాధితులను ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్ఐ

బంట్వారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని తన అధికార వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి. ఈ సంఘటన గురువారం కోట్‌పల్లి బ్రిడ్జి సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని రెండు దిచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒక మహిళ ఉన్నారు. అదే సమయంలో ఎస్ఐ స్రవంతి వికారాబాద్‌లో ఇంటర్ పరీక్షల విధులు ముగించుకుని ఠాణాకు వెళ్తుండగా.. వంతెన వద్ద జరిగిన ప్రమాదాన్ని చూసి, తన వాహనాన్ని ఆపారు. బాధితులను స్వయంగా తన వాహనంలో తీసుకెళ్లి, వైద్య చికిత్స చేయించారు. ఘటనపై ఫిర్యాదు చేసుకున్నామని, బాధితుల వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు!

- ప్రతి ఒక్కరూ సహకరించాలి
- తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్: ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, అందుకు ఈ నెలలో నోటిఫికేషన్ వెలువడనుందని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ విజయ కుమార్ కోరారు. గురువారం స్థానిక తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అఖిల పక్షం నాయకులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన అనంతరం అందరి సహకారం అవసరమన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఓటింగ్ యంత్రాల పనితీరును తహసీల్దార్ నాయకులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, అఖిల పక్ష నాయకులు ఇందనూర్ బషీర్, రమేష్‌బాబు, కృష్ణంరాజు, ఎస్‌బీ గుల్షన్, చంద్రప్ప, ముస్తాక్ రెవెన్యూ సిబ్బంది గోపాల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

వంతెనను విస్తరించండి..



ముబారక్‌పూర్ రైల్వే బ్రిడ్జి

నవాబుపేట: చిన్న రైల్వే బ్రిడ్జి వలన ముబారక్‌పూర్ గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామం మధ్యలోంచి లైను ఉండగా.. లైనుకు ఇరువైపులా నివాసాలు ఉన్నాయి. ఈ ప్రాంత వాసులు ఇరువైపులా రాకపోకలు సాగించడానికి ట్రాక్ కిందిభాగం వంతెన దిక్కు. ఈ అండర్ బ్రిడ్జి చిన్నదిగా ఉండటంతో చిన్నచిన్న వాహనాలు మాత్రమే వచ్చిపోతుంటాయి. కానీ డీసీఎం, లారీల వంటి వాటికి సౌకర్యంగా లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఎవరైనా ఇళ్లు నిర్మించుకోవాలన్నా, ఇతరేతర కార్యక్రమాలు ఏవైనా చేపట్టాలన్నా భారీ వాహనాల్లో నిర్మాణ సామగ్రి, తదితర వాటిని తరలించాల్సి ఉంటుందని, వంతెన చిన్నది కావడంతో కష్టంగా మారిందని పేర్కొంటున్నారు. స్థానికుల ఇక్కట్లను రైల్వే అధికారులు పరిగణనలోకి తీసుకుని వంతెనను వెడల్పు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు లాల్యనాయక్

దోమ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కిష్టాపూర్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాల్యనాయక్ సూచించారు. గురువారం మండల పరిధి గొట్లచెల్కతండా అనుబంధ గ్రామమైన మెట్టుగడ్డతండా పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులను, పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను తెలుగు, ఆంగ్లం, గణితంకు సంబంధించిన సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎల్ఎన్ వర్క్ షీట్స్‌ను పరిశీలించి విద్యార్థులతో చదివించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలు పరిశీలించి, వారిని అభినందించారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపులో నిర్లక్ష్యం చేయకుండా.. నాణ్యతతో కూడిన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్పొరేట్‌కుగా దీటుగా ఫలితాలు తీసుకువచ్చేలా శ్రద్ధ తీసుకోవాలని, అప్పుడే పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాకేశ్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కొడంగల్ రూరల్: పట్టణంలోని కార్గిల్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ ధీర ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరిగింది. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా పట్టణ పురోహితులు కిట్టుస్వామి బృందం ఆధ్వర్యంలో ధాన్యాదివాసం, జలావాసం, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం ఆంజనేయస్వామి, గరుడ స్తంభం, మంగళ స్నానం, అభిషేకం, హోమం, యంత్రస్థాపన, అలంకారణ, మహా మంగళహారతి ఆశీర్వచనం తదితర కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకరణలో స్వామివారు

పాలమూరు ఎంపీ సీటు బీసీకి కేటాయించాలి

దౌల్తాబాద్: పాలమూరు పార్లమెంటు స్థానాన్ని బీజేపీ అభ్యర్థి శాంతికుమార్‌కు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం, బీసీ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాలమూరు పార్లమెంట్ పరిధిలో 60శాతం బీసీల ఓట్లు ఉన్నాయని, కావున బీసీ అభ్యర్థికి సీటు కేటాయించాలని కోరారు. సంఘం నాయకులు రమేష్, శ్రీనివాస్, జగన్ పాల్గొన్నారు.

చేయెత్తినా ఆగని బస్సులు

పరిగి: చేయెత్తినా ఆర్టీసీ బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధి చిట్యాల ఉన్నత పాఠశాలకు వివిధ గ్రామాల విద్యార్థులు వస్తుంటారు. పాఠశాల ముగింపు అనంతరం ఇంటికి వెళ్లేందుకు బస్సుల కోసం నిత్యం గంటల కొద్ది రోడ్డుపై నిరీక్షిస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం సాయంత్రం బస్సు ఆపాలని చేయెత్తినా.. ఆపలేదని, వరుసగా నాలుగు సర్వీసులు వెళ్లినా.. ఏ ఒక్కటీ ఆగలేదని తెలిపారు. దీంతో రాత్రి వరకు రోడ్డుపైనే ఉండాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తంచేశారు. సంస్థ ఉన్నతాధికారులు స్పందించి, బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



రోడ్డు పక్కన బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

ఉపాధి సామాజిక తనిఖీ

ఏపీఓ నర్సింహులు

పెద్దేముల్: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి నిధులు రూ.9.84 కోట్లతో చేపట్టిన సీసీరోడ్లు, తదితర ఉపాధి పనులపై 14వ విడత సామాజిక తనిఖీలు (గ్రామసభ) నిర్వహించనున్నట్లు మండల ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి నర్సింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.6కోట్ల 97లక్షల 49వేల 800లు ఎన్ఆర్ఈసీఎస్ సీసీరోడ్ల పనులకు, రూ.2కోట్ల, 80లక్షల 36వేల 558లు మెటీరియల్ వర్కులకు, ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన రూ.14 లక్షల 37వేల 468లకు సంబంధించి చేసిన పనులకు తనిఖీ ఉంటుందని పేర్కొన్నారు. రెండు రోజుల్లో డీఆర్‌పీలకు చేపట్టిన పనుల వివరాలను అందజేస్తామని వెల్లడించారు. తరువాత డీఆర్‌పీలు గ్రామాలకు వచ్చి పనులను సోదా చేస్తారని, పనుల్లో ఏమైనా అవకతవకలు జరిగిఉంటే.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారని తెలిపారు.



మండల కేంద్రంలో ఉపాధి పనుల రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌పీలు

విద్యార్థుల విహార యాత్ర

కొడంగల్ రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం జడ్చర్ల పట్టణంలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. జీవ వైవిధ్య సంరక్షణకు వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం అధ్యాపకుల ఆధ్వర్యంలో ఆయా కళాశాలలను సందర్శించినట్లు పేర్కొన్నారు. బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ సదాశివయ్య మొక్కలు, జంతువులు వాటి ప్రాముఖ్యత గురించి వివరించినట్లు విద్యార్థులు తెలిపారు. ఇందులో వృక్షశాస్త్ర అధ్యాపకులు రఫియాఖాన్, ఆర్.శ్రీనివాస్, జంతుశాస్త్ర అధ్యాపకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బొటానికల్ గార్డెన్ ఎదుట విద్యార్థులు